టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝుళిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	**1013**	**35.72**

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరికొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెల లోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాప్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటిరీయల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

'ఈఎంఆర్ఎస్'లో స్థానికతేది?

- ప్రిన్సిపాల్ నుంచి పీఈటీ వరకు అందరూ ఉత్తర భారతీయులే..
- దక్షిణాది నుంచి ఒక్కరూ ఎంపిక కాకపోవడంపై అనుమానాలు
- భాష అర్థంకాక విద్యార్థులు సతమతం
- ప్రశ్నార్థకంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భవిష్యత్

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో (ఈఎంఆర్ఎస్) మౌలిక వసతులు కల్పిస్తూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేది. ఈ పాఠశాలను కేంద్రం తన అధీనంలోకి తీసుకుని ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి తీసుకువచ్చింది. సీబీఎస్ఈ సిలబస్ పేరిట ఇటీవల నియామకాలు చేపట్టగా.. ప్రిన్సిపాల్ నుంచి పీఈటీ వరకు అందరూ ఉత్తర భారతదేశానికి చెందిన వారే కావడం.. దక్షిణాది నుంచి ఏ ఒక్కరూ కూడా అర్హత సాధించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఉపాధి లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. బోధన అర్థం కాక విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 28

దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల

అంతా ఉత్తర భారత స్టాఫే..

ఉమ్మడి జిల్లాలో రెండు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు (కోనరావుపేట మండలం మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల) ఉండేవి. ప్రస్తుతం ఈ పాఠశాలలను కేంద్రం తన అధీనంలోకి తీసుకుని సీబీఎస్ఈ సిలబస్ కోసం గతేడాది డిసెంబర్ 6నుంచి 24వరకు అర్హత పరీక్షలు నిర్వహించింది. ఈ ఏడాది జూన్‌లో ఫలితాలు విడుదల చేయగా, ఒక్కరు కూడా దక్షిణ భారతదేశానికి చెందిన తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎంపిక కాలేదు. కేవలం బోధనేతర సిబ్బందిలో స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు, వంట మనుషులు, గార్డెనర్లు మాత్రమే తెలంగాణ సిబ్బందిని ఉంచారు.

ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవిష్యత్

మరిమడ్ల, దుమాల గురుకులాల్లో 25మంది చొప్పున కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన చాలా ఏండ్ల నుంచి నాన్ టీచింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. అయితే ఇటీవల విడుదలైన ఫలితాల్లో టీచింగ్ స్టాఫ్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులకు సైతం దక్షిణ భారత దేశానికి చెందిన వారు ఎంపిక కాలేదు. ఈ క్రమంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన దుమాలలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్, మరిమడ్లలో ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్‌ను విధుల్లోంచి తొలగించడంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. అలాగే కాంట్రాక్ట్ పద్ధతిన దుమాలలో 15మంది, మరిమడ్లలో 8మంది నాన్ టీచింగ్ సిబ్బందిని పలు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరత ఏర్పడి పని భారం పెరిగిందని.. తమ సమస్యలు పరిష్కరించాలని నాన్ టీచింగ్ సిబ్బంది గత గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

విద్యార్థుల వెతలు..

సమస్యలు చెప్పుకొనే ప్రిన్సిపాల్ నుంచి పీఈటీ వరకు అంతా ఉత్తర భారత దేశానికి చెందిన స్టాఫ్ ఉండడంతో హిందీ, ఇంగ్లిష్ భాష సరిగా అర్థంకాక విద్యార్థులు సతమతమవుతున్నారు. గతంలో మరిమడ్ల, దుమాల ఈఎంఆర్ఎస్‌లో ఒక్కో దాంట్లో 30మంది చొప్పున తెలంగాణ బోధన సిబ్బంది ఉండేవారు. విద్యార్థుల సమస్యలు చెప్పుకొనేందుకు, అర్థం చేసుకునేందుకు అవకాశం ఉండేది. సబ్జెక్టు ఇంగ్లిష్‌తో పాటు మాతృ భాషలో ట్రాన్స్‌లేషన్ చేసి అర్థవంతంగా సబ్జెక్ట్ నేర్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేక సగటు విద్యార్థులు వినడమే తప్ప తిరిగి సబ్జెక్ట్ డౌట్స్ అడిగే అవకాశం లేకుండాపోయింది. దుమాలలో జూనియర్, సీనియర్ ఇంటర్ అకాడమిక్ ఇయర్ సగానికి వచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఇంగ్లిష్ లెక్చరర్ లేక పోవడం విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీవోఈ సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

విద్యార్థినులతో ఊడిగం పనులు

- కలెక్టర్ హెచ్చరించినా 'కస్తూర్బా'లో మారనితీరు
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

వీర్నపల్లి, సెప్టెంబర్ 28: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులతో తరగతి గదులు ఊడిపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒత్తిడిని తట్టుకోలేక ఇటీవల ఓ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దుంకిన ఘటన మరువకముందే.. విద్యార్థినులతో ఊడిగం పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు. స్వయంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇటీవల పాఠశాలను సందర్శించి.. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించినా సిబ్బంది మారడం లేదని విద్యార్థినుల ల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- జిల్లా వైద్యాధికారి వసంతరావు
- కేసీఆర్‌నగర్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 28 : ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు సూచించారు. శనివారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో ఎంఎంజే ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ దవాఖాన సౌజన్యంతో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ క్యాంపులు నిర్వహించడం, క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం హర్షనీయమన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. 168 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి, నహీమ్ జహన్, డాక్టర్లు స్నేహ, రేఖ, దీప్తి, భాష, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, బాలయ్య, సీహెచ్‌వో సత్యనారాయణ,సతీష్ ఉన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

ఎస్సారార్ @ 26.50 టీఎంసీలు

బోయినపల్లి, సెప్టెంబర్ 28 : బోయినపల్లి మండలం మూన్వాడ శ్రీ రాజ రాజేశ్వర జలాశయంలో శనివారం 26. 50 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఎస్ఆర్ఎస్‌పీ నుంచి వరద కాల్వ ద్వారా 13930 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా జలాశయం నుంచి ఆరు గేట్ల ద్వారా దిగువకు కూడా 13930 క్యూసెక్‌ల అవుట్ ఫ్లో వెళ్తున్నట్లు వారు తెలిపారు. జలాశయం సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను 26.50 టీఎంసీ నీటి నిల్వ ఉన్నటు, ఇన్ ఫ్లో ఇంకా కొనసాగుతున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ కళ
- జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 28 : విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన ఉత్సావాలకు హాజరై, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించారు. వివిధ కళాపోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 22 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్ల తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ రాపెల్లి అరుణ లక్ష్మీనారాయణ, డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి రాందాస్, దేవత ప్రభాకర్, గోనే బాల్ రెడ్డి ఉన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కళ



నృత్యం చేస్తున్న విద్యార్థునులు

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం
- సిరిసిల్ల పట్టణంలో విషాదం

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 28 : అనారోగ్యంతో ఇద్దరు దంపతులు శనివారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా, భర్త మృతిచెందాడు. భార్య పరిస్థితి విషమంగా ఉన్నది. సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో వి షాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గాంధీ నగర్‌కు చెందిన సామల రమేశ్- లావణ్య అనే దంపతులు గత కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతుండగా, శనివారం ఇద్దరూ విషం తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వారిద్దరినీ సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించగా అప్పటికే భర్త రమేశ్ (55) మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కాగా, భార్య లావణ్య పరిస్థితి విషమించడంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వీరికి హరిణి అనే కూతురు ఉన్నది. మృతుడు రమేశ్ అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కాగా, ప్రస్తుతం వస్త్ర వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆత్మహత్యాయత్నంపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు.

సామల రమేశ్ (ఫైల్)

200 గ్రాముల బంగారు పోగులతో చీర

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 28 : సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. హైదరాబాద్